# కుసుమ జయభేరి

తెలుగు సాహిత్య సేవా సాంస్కృతిక e-మాసపత్రిక





## KUSUMA JAYABHERI E-MAGAZINE

Monthly Telugu Language.

సంపుటి-11 సంచిక-1 అక్టోబర్-2025 ఎడిటర్ - డాక్టర్ రాధా కుసుమ






Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com

www.kusumajayabheri.org

# ధారా వాహిక - 10 చైతన్య స్రవంతి

సాంఘిక నవల
రచన: డా జి భవానీ కృష్ణ మూర్తి

ఆ రోజు సాయం కాలం నుంచే టీవీ లో బ్రేకింగ్ న్యూస్.

"వరకట్నం దురాగతం" "వరకట్నానికి బలయిన మరో అబల") అంటూ సుశీల ఉదంతం అన్నీ ఛానల్స్ లోను, సుశీల భర్త సుబ్బారావు, అత్త మామలు అరెస్ట్ అయ్యారు.

పోలీసులు అరెస్ట్ చెయ్యడానికి వచ్చినప్పుడు సుశీల అత్తగారు శాస్త్రిగారికి కాల్ చేసి,"మీ కూతురు ఎంత పని చేసిందో చూశారా అన్నయ్య గారూ?.."అంటూ, దీర్ఘాలు తియ్యబోతుంటే "చాల్లేవమ్మా ఆవు. టీవీ లో చూపిస్తున్నారు మీ ఘనకార్యం.ఇంటికొచ్చి బ్రతిమాలితే నమ్మి,, బంగారం లాంటి పిల్లని మీకప్పగించాను.

మంచి శాస్తి చేశారు."ఫోన్ పెట్టేశారు.

పరువు ప్రతిష్ఠ అంటూ తండ్రి వాళ్ళ కల్లబొల్లి మాటలు నమ్మి మళ్ళీ వాళ్ళ దగ్గరకి వెళ్ళమంటారేమోనని భయపడుతున్న సుశీల, తండ్రి మాటలు విని తెలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

సుబ్బారావు తన సెల్ కి రింగ్ చేస్తుంటే, సెల్ స్విచ్ ఆఫ్ చేసేసింది. తండ్రి దగ్గరకు వెళ్లి, ఆయన గుండెల్లో ముఖం దాచుకుని "థాంక్యూ నాన్నగారూ!మీరు వాళ్ళ కల్లబొల్లి మాటలు నమ్మి,మళ్ళీ వాళ్ళ దగ్గరికి వెళ్ళమంటారేమోనని వచ్చినప్పటినుంచి బెంగ పెట్టుకున్నాను "అంది.

"పరువు ప్రతిష్ట ముఖ్యమే కానీ ప్రాణం అంతకంటే విలువైనదని అంతమంది బిడ్డల్ని పోగొట్టుకున్నాక కూడా  నేను తెలుసుకోకపోతే, తండ్రిగా నేను అసమర్థుడినమ్మా.ఎంతకాలం బ్రతుకుతానో తెలియని నేను, పరువు అంటూ పాకులాడుతూ నీ నూరేళ్ళ జీవితాన్ని పాడుచెయ్యలేనమ్మ "అన్నారు, కూతురి తల నిమురుతూ.

ఆ రోజు ఉదయం కూతురు,పది లంఖణాలు చేసినదానిలా మెల్లగా ఇంట్లోకి వస్తుంటే చూసి తెల్లబోయారు. అరుగు మీద నుంచి దిగి, గబుక్కున కూతురిని పట్టుకుని, ఆమెని దింపి వెళ్లిపోతున్న కారుని చూస్తూ "ఏమైందమ్మా, చెప్పా పెట్టకుండా ఒంటరిగా వచ్చావ్ " భుజాల చుట్టూ చెయ్యి వేసి,లోపలికి తీసికెళ్లి, "ఇలా ఒక్కదానివీ...... కట్టు బట్టలతో ..."అయోమయంగా చూశారు. "నాన్నా!" ఆయన్ని కావలించుకుని ఏడ్చేసింది.

ఆ హడావిడికి వంటింట్లో నుంచి తొంగి చూసిన సావిత్రమ్మ, మడి మాట మరిచిపోయి, కూతుర్ని పొదివి పట్టుకుని,"ఏమైందే తల్లీ?" అంది, అదుర్దాగా.

తల్లిదండ్రుల సమక్షంలో మనసుకు కాస్త ఓదార్పు లభించింది. శాస్త్రిగారు కూతుర్ని వదిలి, "లోపలికి తీసికెళ్లి ముందు దానికి తాగడానికి ఏదైనా ఇయ్యి "అన్నారు భార్యతో.

సావిత్రమ్మ కళ్ళు తుడుచుకుంటూ కూతుర్ని వంటింట్లోకి తీసికెళ్లి, అక్కడున్న పీట మీద కూర్చోబెట్టి వెళ్లి, ఉప్పు మిరపకాయలు తెచ్చి దిష్టి తీసి, "వెళ్లి కాళ్ళు కడుక్కుని, కళ్ళు తుడుచుకునిరా చిన్నీ" అంది. సుశీల పెరట్లోని బాత్ రూమ్ లోకి వెళ్లి కాళ్ళు కడుక్కుని వచ్చింది. తల్లి పాలు తీసుకొచ్చి ఇచ్చి "ఇవి తాగి పడుకో. లేచాక మాట్లాడు కుందాం "అంది. ఆ గ్లాస్ అందుకుని, పక్కన పెట్టి హాల్లోకి వెళ్లి కుర్చీలో పెట్టిన పేకెట్ తీసుకొచ్చి అందులోనుంచి టాబ్లెట్స్ తీసుకుని వేసుకుని పాలు తాగింది.

"అన్ని మందు బిళ్ళలు మింగుతున్నావేంటే?"అన్న తల్లి మాటలకి సమాధానం చెప్పకుండా వెళ్లి గదిలో మంచం మీద పడుకుంది. తల్లి వచ్చి దుప్పటి కప్పి, తల నిమురి, "ప్రశాంతంగా నిద్రపోమ్మా " అని పక్కలో కూర్చుని తల, వీపు నిమురుతూ కూర్చుంది.

కూతురు నిద్ర పోయిందని భావించి,బయటికి వచ్చి "చిన్ని ఇలా కట్టుబట్టలతో ఒంటరిగా...వచ్చిందంటే ఏదో జరిగింది., అల్లుడుతో మాట్లాడతారా?" శాస్త్రిగారిని అడిగిందావిడ. "ఏం జరిగిందో తెలియకుండా ఏమని అడగను? అది లేచాక కనుక్కుని అప్పుడు...." ఆయన మాట పూర్తి కాకముందే "మీరు వాళ్ళతో మాట్లాడవద్దు నాన్నగారూ. నన్ను చంపడానికి విషం పెట్టారు. ఆ విషానికి నా కడుపులోని బిడ్డ బలయింది. చాలదా? మీరు ఓపిక పట్టమన్నారు. ఇన్నాళ్లు పట్టాను. ఇంక నా వల్ల కాదు. వాళ్ళతో మీరేమి మాట్లాడవద్దు "అంది, అక్కడికి వచ్చిన సుశీల ఏడుస్తూ

"చిన్నీ"!తల్లి ఆమెని దగ్గరికి తీసుకుంది. "ఏంటమ్మా నువ్వు చెప్పేది?" శాస్త్రిగారు నిర్ఘాంతపోయారు. "అవును.. వాడు తాగుబోతు, తిరుగుబోతు. చూడండి నా ఒళ్ళంతా ఎలా కాల్చాడో!" అంటూ మెడ మీద, పొట్టమీద తొడల దగ్గర ఉన్న సిగరెట్ వాతలు చూపించి, భోరుమంది. "నాతల్లీ!"కూతుర్ని కౌగలించుకుని తల్లి కూడా కంట తడి పెట్టుకుంది. "చైతన్య బావ సహాయం చేయకుంటే ఈ పాటికి నా శవం ఈ ఇంటికి వచ్చేది" అంటూ జరిగినదంతా చెప్పింది. "ఇందాక బావగారే నన్ను ఇక్కడ దింపివెళ్లారు." అతను ఫోటోలు డిలిట్ చేసేశానని చెప్పినా, గాలరీలో ఉన్న ఫోటోలు తీసిచూపించింది.

చైతన్య ధైర్యం చెప్తున్నట్లు పక్కన నుంచుని ఉండగా పోలీసులు ప్రశ్నిస్తున్నప్పటి వీడియోలో"" నీకేమి భయం లేదమ్మా..నేనున్నా కదా... జరిగినదంతా వారికి వివరంగా చెప్పు" అని చైతన్య ఆమె తల నిమరడం,ఆటోలో రక్తపు మడుగులో పడి ఉండడం, ఆటో డ్రైవర్ తీసిన ఫోటోలు చూసి తల్లి తండ్రి తల్లడిల్లిపోయారు.

నోట మాట రానట్లుగా కూర్చుండి పోయారు. శాస్త్రిగారికి అతను, వాళ్ళింట్లో పూజ అయ్యాక, రాజమండ్రి నుంచి తీసుకొస్తూ కారులో "అన్ని జీవుల్లో ఉన్నదీ ఆ పరమాత్మ స్వరూపమే అంటూ ఉపన్యాసాలు ఇస్తారు, కానీ,సాటి మనుషుల్ని మనుషుల్లా చూడడానికి కులం అడ్డు వస్తుంది.... మీరు కోరి తెచ్చుకున్న అల్లుడు... సుశీలభర్త తాగుబోతు అయినా, మీ కూతుర్ని కొడుతున్నా మంచివాడే. ఎందుకంటే అతడు మీ కులం వాడు

కనక. మీ కూతుర్ని ప్రాణంగా చూసుకుంటున్న నేను నాటకాలాడే వాడిని....."అతని మాటలు చెవుల్లో మారు మ్రోగుతున్నాయి..

"భారత, భగవతాలు రాసిన వ్యాసుడు, రామాయణం రాసిన వాల్మీకి, మీరు పూజించే రాముడు, కృష్ణుడు మీ కులం వాళ్ళు కాదు. మీరు తినే అన్నం, కట్టుకునే బట్టలు మీ కులం వాళ్ళు చేసినవి కాదు.. అయినా..." "నీకేమి భయం లేదమ్మా నేనున్నాను,నిజాన్ని నిర్భయం గా చెప్పు "అంటూ, చిన్నీ తల నిమురుతున్న చైతన్య కళ్ళ ముందు నిలిచాడు.

శాస్త్రిగారి తల గిర్రున తిరిగింది. అతను కేబ్ బుక్ చేసి, అర్ధరాత్రి వెళ్లి, కేబ్ కీ,డాక్టర్ కి ఫీజులు కట్టి, రాజమండ్రి వచ్చాక మరో డాక్టర్ కి చూపించి, మందులు కొనిచ్చి, తీసుకొచ్చి ఇంటి దగ్గర జాగ్రత్త గా దింపి.....". అతన్ని తను "మంచి వాడివనుకున్నాను ఏమిటీ నాటకాలు "? ఎంత పరుషం గా మాట్లాడాడు?

శాస్త్రిగారిలో అంతర్మథనం.. " చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః... "అనే భగవద్గీతశ్లోకం గుర్తుకొచ్చింది.

అన్నీ తెలిసి, అందరికీ చెబుతూ, అన్నీ వర్ణాల వారు ఇచ్చే పది పాతికతో జీవనం సాగిస్తూ...... కానీ తను. సంప్రదాయానికి బద్ధుడు.

వంశాచారాన్ని తరువాతి తరానికి అందించే వారధి. కానీ తన వారసుడు ఈ కుల వృత్తి లో లేడు. దేశమే దాటి వెళ్ళాడు. అక్కడ ఏం చేస్తున్నాడో ఏం తెలుసు,? చెప్పింది నమ్మడం తప్ప...."

సెల్ రింగ్ అవడంతో ఆయన ఆలోచనలకి అంతరాయం కలిగింది. సుశీల సెల్ ఆన్ చేసి "బావా!చెప్పండి...."అంది. "ఎలా ఉన్నావ్? మందులు టైమ్ కి వేసుకుంటున్నావా? 'అడిగాడు

"వేసుకుంటున్నాను. బాగానే ఉన్నాను." "డాక్టర్ చెప్పారుగా, రక్తం తక్కువగా ఉందని.వేళకి తినాలి. అన్నట్లు రక్తం ఆ కేబ్ డ్రైవర్ ఇచ్చాడని ఇంట్లో

చెప్పకు. అతను ఏ కులం వాడో నాకూ తెలియదు. మీ కులం వాడు మాత్రం కాదు. మీ నాన్నగారికి అభ్యంతరం ఉండవచ్చు. అయినా మీ అమ్మగారి దగ్గరున్నాక నీ బాగోగుల గురించి నేను చెప్పేదేంటిలే" నవ్వి,"పోలీసులు మీ ఆయన్ని, అత్తగారిని అరెస్ట్ చేసి కేస్ బుక్ చేశారు. మనం లాయర్ ని పెట్టుకోవాలి. మీ నాన్న గారికి చెప్పు. తెలిసిన లాయర్లు ఉంటే సరే. లేకుంటే నేను ఏర్పాటు చెయ్యమంటే చేస్తాను. కనుక్కుని చెప్పు" "సరే బావా, నాన్నగారికి చెప్తాను. ఇప్పుడు నాకు ధైర్యం వచ్చింది, మీరు చెప్పారు గాని, పోలీసులు అరెస్ట్ చేశారో లేదో, ఏ క్షణంలో వచ్చి "నా భార్య.. నా ఇష్టం "అంటూఅమ్మనాన్నల్నికూడాకాదనిబలవంతంగాలాక్కెడతాడేమోనని...." "నీకా భయం అక్కరలేదు చిన్నీ, ఆ విషయం మరిచిపో... ఏ సబ్జెక్టులో పీజీ చేస్తావో ఆలోచించుకుని చెప్పు. బుక్స్ పంపిస్తాను. చదువు మీద దృష్టి పెట్టు." "సరే బావా, అక్క, పండు ఎలా ఉన్నారు? "బాగున్నారమ్మా

"ఒకసారి ఫోన్ అక్కకిస్తారా?"

"నేను సైట్ దగ్గరున్నానమ్మా"

"సరేలెండి. నేను అక్కకి చేసి మాట్లాడతాం

"సెల్ ఆఫ్ బోతుంటే "నాకివ్వమ్మా" అడిగారు శాస్త్రి గారు.

"బావా, ఒక్క నిముషం" చెప్పి, సెల్ తండ్రికిచ్చింది

సుశీల. "బాబూ! నేనన్న మాటలేవీ దృష్టిలో పెట్టుకోకుండా నా కూతురికి అంత సహాయం..." "నమస్కారం గురువు గారూ! క్షమించండి. మీ కూతురు అని కాదు. నా భార్యకి చెల్లెలు అని, ఆమె కోరిందని.... అది కూడా సహాయం అనుకుని.... కాదు... బాధ్యత అనుకుని చేశాను. మీకు అభ్యంతరం అయితే..."

"అయ్యో! నా అభిప్రాయం అది కాదు బాబూ. నా మాటలు గుర్తు పెట్టుకోకుండా అంత సహాయం చేశావు. నీకు కృతజ్ఞతలు.. ఎలా..."

"దయచేసి అంత పెద్దమాటలు వద్దు. మీరు ఆశీర్వదించవలసిన పెద్దలు. ఒక విధంగా మీరే నన్ను క్షమించాలి.

ఆ అర్ధరాత్రి వేళ వేరే దాతలు దొరక్క ఏ కులంవాడో తెలియని ఆ కేబ్ డ్రైవర్ రక్తం సుశీలకి ఎక్కించారట.ఆ సమయంలో రక్తం ఎక్కించక పోతే ఆమె బ్రతికేది కాదని డాక్టర్ అన్నారు.అది నాకు తెలియకుండా జరిగిపోయింది. తెలిసి ఉంటే ముందుగా మీ అనుమతి అడిగి ఉండేవాడిని." "చైతన్యా! ఆ నాటి నా ప్రవర్తనవల్ల నీ మనసు ఎంత గాయపడిందో నాకు అర్థం అవుతోంది బాబూ."ఆయన స్వరంలో పశ్చాత్తాపం గమనించి "అదేమీ లేదు. గురువుగారూ!ఆ విషయాలేవీ మనసులో పెట్టుకోకండి. నేనెప్పుడో మరిచిపోయాను. చిన్నీకి చెప్పాను లాయర్ గురించి. మీరు ఏర్పాటు చేస్తే...."

"ఆ పోలీసులు, కేసుల గురించి నాకు తెలియదు. నువ్వే చూడు బాబూ. దానికి చాలా ఖర్చు అవుతుందనుకుంటా. వీలు చూసుకుని పంపిస్తాను."

"అహ.. మీరేమి పంపవద్దు అన్నీ నేను చూసుకుంటాను.. అమ్మగారికి నమస్కారాలని చెప్పండి. చిన్నీ చాలా బలహీనంగా ఉంది ఆరోగ్యం జాగ్రత్త... ఉంటానండి. నమస్కారం "చెప్పి పెట్టేశాడు. "నాన్న గారూ! అక్కతో కూడా ఒక్కసారి మాట్లాడతారా?" అడిగింది. "చెయ్యమ్మా "అన్నారుకుర్చీలో వెనక్కి జార్లబడి కూర్చుంటూ.

చైతన్య లోపలికొస్తూనే బాబుని ఎత్తుకుని గిరా గిరా తిప్పాడు. "ఏమిటో శ్రీవారు అంత సంతోషంగా ఉన్నారు "అంది స్రవంతి మంచినీళ్లు అందిస్తూ. "అవును. చాలా సంతోషంగా ఉన్నాం"

"నేనుకూడా "అంది అతన్ని హగ్ చేసుకుంటూ. "ఔనా! ఏంటి విశేషం? వీడికి తమ్ముడో, చెల్లెలో పుట్టబోతున్నారా?" చిలిపిగా కన్ను గీటాడు. "ఛీ. పోండి.. మీకెప్పుడూ అదే ధ్యాస "సిగ్గుపడి అతని గుండెల్లో ముఖం దాచుకుని ఛాతి మీద ముద్దు పెట్టింది.

"ఏమిటి సంగతి అంత హ్యాపీగా ఉన్నావ్ " అన్నాడు,వాళ్ళ నాన్న గారు మాట్లాడి ఉంటారని ఉహించినా, తెలియనట్లే అడిగాడు.

"నాన్నగారు మాట్లాడారు." అంది సంతోషంగా.

"ఆర్ యూ హ్యాపీ?" అవుననట్లు తల ఊపింది.

ఆమె నుదుటి మీద ముద్దు పెట్టుకుని" నాతో కూడా మాట్లాడారు ". అన్నాడు కూల్ గా.

"నిజంగా "

"నిజ్జంగా నిజం ". అంటూ జరిగిన విషయం చెప్పాడు.

( సశేషం )



# కథలు

## అనసూయలో మార్పు

రచన: యం. వి. ధర్మారావు
అనకాపల్లి .

అది ఆనందరావు అనసూయలుండే ఇల్లు. పెళ్లయ్యి రెండేళ్ళవుతోంది. అనసూయకు ఆన్లైన్ షాపింగ్ అంటే చచ్చేంత ప్రాణం. ఏ వస్తువు కావాలన్నా, చివరకు చీపురుపుల్ల కావాలన్నా ఆన్లైన్ షాపింగ్ చేయాల్సిందే!.. ఇది పెళ్ళైన కొత్తలో ఆనందరావుకి ఇబ్బందిగా ఉన్నాగానీ, ఏమీ అనలేక ఊరకునేవాడు. కానీ ఆ అలవాటు అనసూయలో విపరీతమవ్వడంతో ఆనందరావుకి చిరాకుపుట్టేది. బయటకేమీ అనలేకపోయేవాడు.

ఒకసారి ఉదయమే "ట్రింగ్ ట్రింగ్ ట్రింగు"మంటూ కాలింగ్ బెల్ మ్రోగుతుంటే, పేపరు చదువుతున్న ఆనందరావు లేచి తలుపుతీసాడు.

ఎదురుగా డెలివరీ బోయ్.

"సార్!మీకో పార్సిల్ వచ్చిందండి.."

"నేనేం ఆర్డరు చేయలేదే!"

"మేడమ్ చేసారేమో కనుక్కోండి సార్ .....

ఇంతకీ ఆ పార్శిల్ ఏమిటో? చూస్తాను ఉండండి సార్ . ."చూసి, "ఆఫర్ లో వచ్చిన మినప వడియాలు సార్ ."... "ఏంటో ఈ ఆఫర్?"

"ఒక పేకట్ కొంటే ఒకటి ఫ్రీ సార్! పైగా పేకెట్ ధర..రెండు వందల రూపాయలు మాత్రమే.." ఇంతలో అనసూయ లోపలినుంచి వస్తూ, "పార్శిల్ వచ్చేసిందా! ఏమండోయ్! అందులో రెండు పేకెట్లున్నాయో లేదో చెక్ చెయ్యండి... ఎందుకంటే మొన్న ప్రక్కింటి అరుణొదిన ఆవకాయ ఆర్డరుచేస్తే గడ్డి పేకింగ్ చేసి పంపించేసారట."..

"ఆ.. ఆ... చూసాను రెండుపేకె ట్లూ ఉన్నాయి. సరే నువ్వెళ్ళు బాబూ! "అంటూ ఆ కొరియర్ బాయ్ ని పంపించిన తర్వాత, ఆనందరావు అనసూయతో...

“ఒసేయ్ అనసూయా!నీకు అసలు బుద్ధుందే? వడియాలెవడైనా ఆన్లైన్ లో తెప్పించుకుంటాడే? “అన్నాడు

“ఆఫర్ లో తక్కువకొస్తే తీసుకున్నానండి.”.. “వడియాలనేవి ఇంట్లో పెట్టుకునేవి, అవి ఎవడైనా ఆర్డరిచ్చుకుంటారే పిచ్చి మొహమా?” “అవే కావండోయ్! మీరిక బజారుకి వెళ్ళకుండా కాయగూరలు, వంట చేసుకోకుండానే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఆర్డరిచ్చిన ఐదు నిమిషాల్లో ఇక్కడుంటాయి... అన్లైన్ షాపింగ్ అంటే ఏమనుకున్నారు..!”.అంది ఉత్సాహంగా.

“నీ ఆన్లైన్ షాపింగ్ మండా! వంటైనా, ఊరగాయైనా ఇంట్లో చేసుకుంటేనే శుచిగాను, శుభ్రంగాను ఉంటాయి. నువ్విలా ప్రతీదానికీ ఆన్లైన్ షాపింగ్ అంటే మన ఆస్తులు గుల్లవుతాయి. నీ తీరు చూస్తుంటే రేపొద్దున్న అమ్మాయికి పెళ్ళిచేయాల్సి వస్తే అల్లుడిని ఆన్లైన్లో బుక్ చేసేలా ఉన్నావు ..” తల బాదుకున్నాడు ఆనంద రావు.. “అవునండోయ్,అసలు నేనీ విషయమే మరిచిపోయాను.. అస్తమాను ఎవడెవడో వచ్చి చూసిపోయేకంటే, ఎవడో నచ్చినవాడిని చూసుకుని ఆన్లైన్లో బుక్ చేసుకుంటే సరిపోదూ?”.

“ఒసేయ్ ఒసేయ్!నీ ఆన్లైన్ బుకింగ్ తగలెయ్యా! నువ్వన్నంతపనీ చేసేలా ఉన్నావు.. ముందు నీ ఫోన్ ని బ్రద్దలకొట్టేస్తేగాని నువ్వా ఆన్లైన్ షాపింగ్ ఆపవే...”

ఆమె చేతిలోని ఫోన్ అందు కోబోయాడు. “ఏమండోయ్! మీరు బ్రద్దలుకొట్టేస్తే...అంటే గుర్తొచ్చింది.. మొన్న ఎదురింటి కనకం ఫోన్ ఇలాగే క్రిందపడి బ్రద్దలైతే, ఫ్లిప్ కార్ట్ లో ఐదువేలకే మంచి ఫోన్ వచ్చిందండి. ఆ కనకం బుక్ చేసిన ఫోన్ లాంటిదే బుక్ చేయండి..”..

“ఒసేయ్! ఇక ఆపవే ఆకలౌతోంది. కాస్త టిఫిన్ ఏం చేసావో పెట్టవే!...” “ఏమండోమ్!ఈ రోజు ఆదివారం కదా! మీరు ఇంట్లోనే ఉంటారు కదాఅని. జుమాటోలో వేడివేడిగా రుచికరమైన దోశలను ఆర్డరిచ్చాను. ఇంకో పది నిమిషాల్లో వచ్చేస్తాయి. ఇంతలోగా చేతులు కడుక్కుని డైనింగ్ టేబులుపై కూర్చోండి.” ఇంతలో ఆ వీధిలోఉండే కాత్యాయని వదినా అంటూ ఓ బ్యాగ్ తో లోనికొచ్చింది... ఆ వస్తున్న కాత్యాయనిని చూసి అనసూయ “ఏంటి వదిన ఇలా వచ్చావు?”. “చూడొదినా!నాప్టాల్ లో బుక్ చేసిన ఈ చీరలు ఇప్పుడే వచ్చాయి.ఈ ఐదు చీరలు వెయ్యిరూపాయలు. ఎంత బాగున్నాయో చూడు..”

“అవునొదినా!.. చాలా బాగున్నాయో ఇప్పుడే బుక్ చేస్తానుండు..”. అసలే మండిపోతున్న ఆనందరావుకి, అనసూయ అన్నమాటలు ఇంకొంచెం మంటను రగిల్చాయి..

"మీరంతా అసలు చీరలే కట్టరు, ఎప్పుడుచూసినా ఆ నైటీలతోనే కాలం గడిపేస్తారు కదా! ఇంకా ఇంకా చీరలు ఏం చేసుకుంటారు. మీ మొహాలు మండా!" అంటూ వూగిపోతా ఉంటే... కోపంగా ఉన్న ఆనందరావుని చూసి భయంతో,అక్కడినుండి మెల్లగ జారుకుంది కాత్యాయని.

"ఏంటండీ, మీకు షాపింగ్ కి తీసుకువెళ్ళే పని తగ్గిస్తుంటే అలా సీరియస్ అవుతారు.." "అది పని తగ్గించడం కాదే!.. ఇంటిని గుల్ల చేయడమంటారు... ఇక నువ్వు ఆ ఆన్లైన్ షాపింగ్ ఆపకపోతే నీకు విడాకులిచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేయాల్సివస్తుంది." గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు.

"అమ్మో! అంతవరకు వెళ్ళకండి.నేనే నెమ్మదిగా కొన్ని సంవత్సరాల్లో ఆపేస్తాను..." "కొన్ని సంవత్సరాలా? ఓరి దేవుడా! ఇక దీనిని మార్చలేము... ఇక నేనే మారాలేమో?".. ఇంతలో జుమాటో బోయ్ తెచ్చిన టిఫిన్ అందుకుని అసలే ఆకలితో ఉన్న ఆనందరావు ఆవురావురుమంటూ తినేశాడు....

ఇంతలో పొరుగూరు నుండి అనసూయ మేనత్త సుగుణ మామయ్య రాఘవ ఇద్దరూ వస్తూనే," ఏం అబ్బాయి బాగున్నావా! "అంటూ పలకరిస్తే..

"ఆ ఏదోలెండి ఇలా పడివున్నాను..."

"ఇంతకీ ఏమైంది బాబు అలా ఉన్నావు? "అనేలోపే అనసూయ ప్రత్యక్షమై "మావయ్య, అత్తా బాగున్నారా?ఎప్పుడొచ్చారు?" అని ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే.. దానికి అత్త సుగుణ

"ఇప్పుడేనమ్మ వచ్చాము.. ఇంతకీ మా అబ్బాయేమిటమ్మా ఆలా ఉన్నాడు?"

"ఆయనంతేలే అత్తా... ఇంకేంటి విషయాలు?"..

"మా విషయాలటుంచి మీ విషయమేమైందే అనసూయా?"

"మా విషయమా ఏంటత్త?

"అదేనే మేనకోడలా పిల్లా! పిచ్చుక లేరేమని.." అసలే మండి ఉన్న ఆనందరావు ఆ మాట వినేసరికి వ్యంగ్యంగా

"మీ మేనకోడలు ఆన్లైన్లో కంటుందిలెండి పిల్లల్ని.." ఆనందరావు అలా అనేసరికి సుగుణ" ఏంటీ..ఆన్లైన్లో కనడమా?... చోద్యంగా వుందే!

"మీ మేనకోడలు ఏం కావాలన్నా ఆన్లైన్లో బుక్ చేసేస్తుంది.. బిడ్డ ఒకలెక్కా.."

"ఏంటే కోడలా అనసూయా! ఈ అబ్బాయి ఇలా అంటున్నాడు?"

"అదేమీలేదత్తా,ఆయనంతే అలా జోకులేస్తుంటారు... "కానీ,రాఘవకు అది అర్థమై "ఒసేయ్ సుగుణా! కాస్త ఇటురావే "అని చెప్పి, తన చెవిలో ఏదో ఊదేశాడు..సుగుణకేదో అర్థమైంది అన్నట్లుగా

అనసూయతో ఇలా అంటుంది.. "చూడు మేనకోడలా!మనం కట్టుకున్నవాడు మనం చేసిపెడితే కమ్మగా తినాలని చూస్తాడు.. అలాంటిది నువ్వు ప్రతీది ఆన్లైన్లో తెప్పించి పెడుతుంటే కొన్నిరోజులకు నీ మీద ఇష్టం తగ్గి,మా అబ్బాయి నీకు దూరమయ్యే ప్రమాదముంది చూస్కో. అబ్బాయి చాలా మంచోడు. వాడి మనసు మారకముందే నువ్వు మారు.. తనతో సఖ్యతతో మెలగు, చక్కగా కాపురం చేసుకో. లేదంటే,నీ జీవితం నువ్వే బుగ్గిపాలు చేసుకున్నట్లే.చూస్కో మరి" అని సుగుణ అనేసరికి అనసూయకు జ్ఞానోదయం అయ్యింది. తన తప్పు తాను తెలుసుకొంది.

మేనత్త సుగుణ మామయ్య రాఘవ "ఇకవెళ్ళొస్తాం" అని అనసూయ ఆనందరావులకు చెప్తుంటే, అనసూయ, ఆనంద రావులు "రెండురోజులు ఉండి వెళ్ళండి "అని అంటే" అమ్మో! ఆ ఆన్లైన్ వంటకాలు మేం తినలేమమ్మో" అంటూ ఇద్దరూ ఒకేసారి నవ్వు విసురుతారు..

అనసూయ సిగ్గుతో తలదించుకొని, తన జీవితంలో ఇంకెప్పుడు అ ఆన్లైన్ ఊసే ఎత్తలేదు.. ప్రతిరోజు భర్తకు ఏం కావాలన్నా తానే చక్కగా చేసిపెడుతోంది. భార్యలో వచ్చిన ఆ మార్పు చూసి ఆనందరావు తెగ ఆనందపడ్డాడు...

కథ సుఖాంతం.

# లక్ష్యం

రచన: షహనాజ్ బతుల్
అనకాపల్లి .

"నేను ఇంజనీరింగ్ చదవనమ్మా" కూతురు సృజన మాటని విని ఒక్కసారి షాక్ తిన్నది, పార్వతమ్మ. ఇంజనీరింగ్ చదవాలన్నది సృజన కల,

లక్ష్యం. గవర్నమెంట్ యూనివర్సిటీలో రావాలని, పట్టుదలగా చదివింది. మంచిర్యాంకు వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో సీటు వచ్చింది. మరి ఎందుకు చదవను అంటుంది? ఆశ్చర్యంగా చూసింది కూతురి వంక.

"నువ్వు అందరితో ఇంజనీరింగ్ చదువుతాను అని, చెప్పే దానివి కదా. అందుకే మంచి ర్యాంక్ తెప్పించుకున్నావు కదా, బాగా చదివావు కదా. ఇప్పుడేమైంది నీకు?" అడిగింది

సృజన వచ్చి పార్వతమ్మని కౌగిలించుకుని

"నిన్ను వదిలి ఉండలేనమ్మా, ఈ ఊరు వదిలి ఎప్పుడూ సిటీకి వెళ్లలేదు. హాస్టల్లో ఉండలేను" అన్నది ఏడుస్తూ.

"మన జీవిత లక్ష్యం నెరవేరాలంటే తప్పదమ్మా. ఒకటి కావాలనుకున్నప్పుడు, మరొకటి వదులుకోవాలి. ఇప్పుడు వాట్సప్ ఉంది కదా! వీడియో కాల్ రోజూ చేస్తూ ఉండు నాకు. నేను రోజూ మాట్లాడుతాను, రోజూ నీకు కనిపిస్తాను. సెలవుల్లో ఎలాగు వస్తావు కదా."

"వద్దమ్మా నేను వెళ్ళనుఅని అంటున్న కూతురిని సముదాయిస్తూ "పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం. నేను నీకు కొన్ని కథలు చెప్తాను. " అని అన్నది.

"అప్పట్లో వాట్సప్ లేదు. మొబైల్స్ లేవు. నేనెప్పుడూ చెప్తుంటాను కదా, నా ఫ్రెండ్, విశాల. తను 10వ తరగతి వరకు నాతో చదివింది. మన ఊర్లోనే. వాళ్లది మధ్యతరగతి కుటుంబమే.

విశాల వాళ్ళ నాన్నగారు పదహారు సంవత్సరాల వయసులో విశాలకు పెళ్లి చేశారు.

పెళ్లి అయిన పద్దెనిమిది నెలలకి కూతురు పుట్టింది. విశాల భర్త సునీల్ చాలా మంచివాడు. చాలా బాగా చూసుకునేవాడు.

అత్త మంచిది కాదు. చిత్ర హింసలు పెట్టేది. అయినా భర్త మంచివాడు కదా ఇంకేం కావాలి అనుకున్నది.

చాలా సంతోషంగా ఉన్నది. నేను కూడా వెళ్లాను పాప పుట్టినప్పుడు చూడటానికి. భలే ముద్దొస్తూ ఉండింది పాప.

పాపకు ఆరు నెలలు వచ్చాయి. అంటే విశాలకు పద్దెనిమిది సంవత్సరాలు. నుకోకుండా పెద్ద ప్రమాదం జరిగింది.

రోడ్డుమీద. ఇద్దరూ స్కూటర్ మీద వెళ్తుంటే పెద్ద వ్యాన్ గుద్దేసింది. పాపను ఇంటిదగ్గర వదిలేసి వెళ్లారు.

ఆ ప్రమాదంలో సునీల్ చనిపోయాడు. విశాల కొద్ది గాయాలతో బయటపడింది. ఆ తర్వాత విశాలని అత్త ఇంటి నుండి గెంటేసింది.

ఏమి చేయాలో తెలియలేదు. పాపను తీసుకొని తన బట్టలు తీసుకొని పుట్టింటికి చేరింది.

తనకి ఒక చెల్లి తమ్ముడు ఉన్నారు. వాళ్లకి పెళ్లి కావాలి. తమ్ముడు చదువుకోవాలి, ఉద్యోగం రావాలి.తల్లిదండ్రులు కూతుర్ని పోషించగలరు కానీ ఎంతకాలమని. తనకి ఒక పాప పుట్టింది కదా.

పాపకి వెన్నెల అని పేరు పెట్టుకుంది. పాప కోసం ఏమైనా కొనాలన్నా తండ్రిని అడగాలి. తండ్రి ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రం.ఆ సమయంలో టైపు సెంటర్ కి వెళ్లి టైప్ నేర్చుకున్నది.

పుస్తకాలు చదవటం మొదలు పెట్టింది.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీకికట్టింది.చిన్నఉద్యోగంచేసుకుంటూ,చదువుకుంటూ,పాపనుపోషించుకుంటూ ఉండింది. పట్టుదలగా చదివి డిగ్రీ పాస్ అయింది.

ఒక ఆఫీసులో టైపిస్ట్ గా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత కంప్యూటర్ మీద టైపింగ్ నేర్చుకున్నది. అప్పుడప్పుడే ఇంటర్నెట్ వచ్చింది.

హైదరాబాద్ కు వెళ్లి, ఒక ఇల్లు అద్దె తీసుకొని, పాపని పెంచుతూ, చదివిస్తూ, ధైర్యంగా నిలబడింది.

వెన్నెల నీకంటే పెద్దది. ఎంటెక్ చేసింది. ఇప్పుడు తల్లిని పోషిస్తున్నది. ఈ కాలంలో చాలామంది విదేశాలకు వెళ్తున్నారు. కానీ వెన్నెల తల్లిని వదిలి వెళ్ళనని తన దగ్గరే తల్లిని పెట్టుకున్నది.

ఇప్పుడు వాళ్ళు చాలా మంచి పొజిషన్లో ఉన్నారు. వెన్నెలకి పెళ్లి చేయాలని విశాల చూస్తుంది. కానీ వెన్నెల తల్లిని కూడా తన దగ్గర పెట్టుకోవటానికి ఒప్పుకున్న వ్యక్తిని మాత్రమే పెళ్లి చేసుకుంటానని చెప్పింది.

నేను ఎందుకు విశాల కథ చెప్పానంటే, చిన్న వయసులో వితంతువు అయినా, పట్టుదలగా చదివింది ఉద్యోగం లో చేరింది. పల్లెటూర్లో పుట్టి పెరిగింది. ఇల్లు పాఠశాల తప్ప ఏమీ తెలియదు. పదవ తరగతి వరకు మాత్రమే చదివింది.

అటువంటి విశాల ఒక్కతే కూతుర్ని తీసుకొని హైదరాబాద్ వెళ్ళింది. ఉద్యోగంలో స్థిరపడింది. తన కథని స్ఫూర్తిగా తీసుకోవాలి.

కానీ ప్రస్తుతం విశాల హైదరాబాద్ లో లేదు. వెన్నెలకి చెన్నైలో ఉద్యోగం వస్తే కూతురి తో వెళ్ళిపోయింది. లేకపోతే నీకు తనే ఆశ్రయము ఇచ్చేది. సహాయం చేసేది.

ఇప్పుడు ఇంటర్నెట్ వచ్చింది. మొబైల్స్ వచ్చాయి. నేను ఉద్యోగం చేస్తున్నాను నా గురించి నువ్వు ఆలోచించవద్దు. సెలవుల్లో వస్తావు. ఇంకా చాలా స్ఫూర్తి నిచ్చే కథలు ఉన్నాయి." అని చెప్పింది.

"అది కాదమ్మా, నాన్నగారు కూడా చనిపోయారు కదా. నువ్వు ఒక్కదానివే ఉండాలి కదా. నేను నిన్ను వదిలి ఎప్పుడూ లేను." "ఇప్పుడు ఉండక తప్పదు. నువ్వు పట్టుదలగా చదివి ఎంసెట్లో మంచి ర్యాంక్ తెప్పించుకున్నావు కదా. అలాగే ఇంజనీరింగ్ చదువు."

పార్వతమ్మ, విశాలకి వీడియో కాల్ చేసింది. "హలో పార్వతి ఎంత కాలానికి నేను గుర్తుకొచ్చాను." అన్నది విశాల.

"నా కూతురికి ఇంజనీరింగ్ లో ఉస్మానియా యూనివర్సిటీలో సీటు వచ్చింది. హాస్టల్లో ఉండాలి. నన్ను వదిలి వెళ్లనని హాస్టల్లో చదవనని ఏడుస్తుంది" చెప్పింది పార్వతమ్మ. "నా గురించి మీ అమ్మ చెప్పే ఉంటుంది కదా సృజనా. చిన్న వయసులో నా భర్తను పోగొట్టుకొని, అత్తవారింటికి దూరమై, ఎన్నో కష్టాలు పడి, హైదరాబాద్ లాంటి నగరంలో కామంధుల నుండి నన్ను నేను రక్షించుకుంటూ, నా కూతుర్ని రక్షిస్తూ, సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లో అద్దెకు ఉంటూ గడిపాను.

కొంతమంది ఏవేవో మాటలు చెప్తుండేవారు. భర్త లేని దానికి రంగు చీరలు ఎందుకు? అంటూ నిష్ఠూరంగా మాట్లాడేవారు. ఏ పేరంటాలకి ఎవ్వరూ పిలిచేవారు కాదు. నేను అవేమీ పట్టించుకోకుండా నా పని ఏదో నేను చేసుకొని పోయేదాన్ని. నా కూతుర్ని కూడా అలాగే పెంచాను. చదువు మీద ధ్యాస కలిగేటట్టు చేశాను.

ఇప్పుడు తను ఎంటెక్ చదివింది. మంచి ఉద్యోగం చేస్తున్నది. నేను కూడా ఉద్యోగము చేస్తున్నాను."

"ఆంటీ మిమ్మల్ని వచ్చి కలవాలి అనిపిస్తుంది. నేను చదువుతాను ఇంజనీరింగ్." "చాలా సంతోషము మంచి అమ్మాయి. నేను కూడా నీతో మాట్లాడుతుంటాను

ఫోన్లో." పార్వతమ్మ ఫోన్ సృజన చేతి నుండి తీసుకుంది. "విశాలా చాలా చాలా థాంక్స్. మా అమ్మాయి హాస్టల్ లో చేరటానికి ఒప్పుకున్నది."

"నీ ఆరోగ్యం ఎలా ఉంది పార్వతి?" "బావుంది విశాల. మా అమ్మాయి ఇంజనీరింగ్ లో చేరిపోతోంది కదా"

"అవును ఈ విషయం నాకు ఇంతవరకు ఎందుకు చెప్పలేదు?" "తను హాస్టల్లో చేరాక చెబుదామనుకున్నా ను. వెన్నెల లేదా ఇంట్లో?" "లేదు డ్యూటీ కి వెళ్ళింది. వచ్చాక చెబుతాను. తను చాలా సంతోషిస్తుంది. తన మొబైల్ నెంబర్ నేను నీకు పంపుతాను వాట్సప్ లో సృజనకి ఇవ్వు. సృజన హాస్టల్ లో చేరినప్పుడు వెన్నెల కూడా కొంచెం ధైర్యం చెబుతూ ఉంటుంది.

"అలాగే హైదరాబాద్ కి బయలుదేరాలి. ఉంటాను. అమ్మాయి ఒప్పుకుంది కదా ఇంజనీరింగ్ చదవడానికి." అలాగేనని ఫోన్ పెట్టేసింది.

సృజన ఇంజనీరింగ్ లో చేరింది హైదరాబాదులో. హాస్టల్లో చేర్పించి పార్వతి వెన్నెలకు వీడియో కాల్ చేసింది. వెన్నెలకి, సృజనకి స్నేహం ఏర్పడింది. వెన్నెల కూడా అప్పుడప్పుడు ఫోన్ లో మాట్లాడుతూ ఉండేది.

ఎక్కువగా బయటికి వెళ్లకుండా, కాలేజీ ఫంక్షన్స్ లో పాల్గొంటూ, హాస్టల్లో డిస్టర్బెన్స్ గా ఉంటుందని, కాలేజీకి వెళ్లి లైబ్రరీకి వెళ్లి చదువుకోవటం చేస్తుండేది. నాలుగు సంవత్సరాలు పూర్తయ్యాయి.

మంచి మార్కులతో ఇంజనీరింగ్ ఉత్తీర్ణురాలయింది. మళ్లీ సమస్య వచ్చింది. సృజనకి. హైదరాబాదులో ఉన్న కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

దానిని తిరస్కరించింది సృజన. "నువ్వు చేరు పరవాలేదు నేనొక్కదాన్నే ఉంటాను" అన్నదిపార్వతమ్మ.

"నువ్వు చేస్తున్న ఉద్యోగం గవర్నమెంట్ ది కాదు కదమ్మా. అది వదిలేసేయ్ నాతో హైదరాబాద్ వచ్చేసేయ్ అక్కడ ఏదో ఒకటి దొరుకుతుంది. లేకపోయినా పరవాలేదు నాకు మంచి జీవితం ఉంది నిన్ను బాగా చూసుకుంటాను" అన్నది.

చివరికి పార్వతమ్మ తన ఉద్యోగం మానేసి కూతురుతో హైదరాబాద్ వచ్చేసింది.

ఒక డబల్ రూమ్ ఫ్లాట్ అద్దెకి తీసుకొని ఉన్నారు. మూడు సంవత్సరాలు గడిచిపోయాయి.

సృజన కొంత లోన్ తీసుకొని మంచి ఫ్లాట్ కొనుక్కున్నది. వాళ్ళ కంపెనీలు పనిచేస్తున్న, సురేష్ సృజన కి ప్రపోజ్ చేశాడు. తను కచ్చితంగా చెప్పేసింది. "మా అమ్మ కూడా నాతో ఉంటుంది. ఇక మీరు మా ఇంటికి రావచ్చు. దీనికి ఒప్పుకుంటేనే మన పెళ్లి జరుగుతుంది. అమ్మని ఒక్కదాన్నే వదిలిపెట్టలేను. ఇల్లరికం రావడానికి సురేష్ ఒప్పుకున్నాడు. పార్వతమ్మ కూతురు అల్లుడు సంతోషంగా ఉన్నారు.



# స్ఫూర్తి ప్రదాత

రచన: సీర సంగీత శ్రీ

తరగతి గదిలో సామాన్య శాస్త్రం బోధిస్తున్నారు ఉపాధ్యాయుడు సుధాకర్. అన్య మనస్కంగా తన స్టూడెంట్ మానసని గమనిస్తూ పాఠాన్ని చెప్తూ ఉన్నాడు. పాఠం చెప్పడం అయిపోయిన తరువాత అందర్నీ తను చెప్పిన పాఠంలో నుంచి ప్రశ్నలు అడుగుతున్నాడు. అయినా అమ్మాయి అలాగే ఏదో ఆలోచనలో ఉన్నట్టుగా కనబడుతుంది. తన వంకే చూస్తుంది కానీ తన ఆలోచనలు ఎక్కడో ఉన్నాయి? ఏమిటో కనుక్కోవాలి. నేను చెప్పిన పాఠం మానస వినలేదు అని నాకు అర్థం అవుతుంది ఇప్పుడు లేపి తనని ప్రశ్నించి అందరి ముందు తను అవమానపడడం సుధాకర్ సార్ కి ఇష్టం లేదు.

అందుకనే బెల్ అవ్వగానే "మానసా, ఇలారా" అంటూ పిలిచారు.

మానస వెళ్లి చేతులు కట్టుకొని నిలబడింది.

"ఈ బుక్స్ కాస్త స్టాఫ్ రూమ్ లోకి తీసుకురామ్మా" అన్నారు.

ఎప్పుడూ వేరే వాళ్లకు సార్ పని చెప్తాడు ఈరోజు మానసని తీసుకురమ్మని చెప్పారు.

పిల్లలు ఒక్క క్షణం ఆలోచించారు "ఎందుకు సర్ తనని తీసుకురమ్మన్నారు అని. మళ్లీ అంతలోనే సరేలే సుధాకర్ సార్ కి ఎవరి పేరు నోటికొస్తే వాళ్లకే చెపుతారు కదా "అనుకొని తమ మాటల్లో మునిగిపోయారు విద్యార్థులు.

పుస్తకాలు తీసుకొని సారుని అనుసరించింది మానస .తనతో సమానంగా నడుస్తూ "మానసా, ఏమైందిరా? నేను పాఠం చెప్పడం మొదలుపెట్టినప్పటి నుంచి నిన్ను గమనిస్తున్నాను. నీవు ఎక్కడో ఆలోచిస్తున్నావ్, ఏమైంది? ఇంట్లో ఏమైనా ప్రాబ్లమా?" అని అడిగారు.

దానికి జవాబుగా "లేదు సార్, ఇంట్లో అంతా బాగానే ఉంది. మీకు తెలుసు కదా! అన్న, అమ్మానాన్న, అక్క ఏమీ అనరు. నాకు ఇంకా చదువులో వాళ్ళు సహాయం కూడా చేస్తారు .అమ్మ ఇంటి పనులు కూడా ఏమి చెప్పదు. అక్క, అన్నయ్య అమ్మకు సహాయం చేస్తారు. " అన్నది మానస "అవును, మరి ఎందుకని అలా ఉన్నావు?

“సార్, నాకు ఎంత చదివినా తెలుగు పద్యాలు కంఠస్థం రావడం లేదు. అసలు స్నేహితులందరూ బాగా నేర్చుకొని గడగడ చది వేస్తున్నారు. తెలుగు సార్ కోప్పడుతుంటే నాకు చాలా బాధగా అనిపిస్తుంది. నేను ఎంతో చదువుతున్నాను. అక్క అన్నయ్య కూడా సహాయం చేస్తున్నారు కానీ నాకు గుర్తుండడం లేదు. నేను ఎలాగైనా నేర్చుకోవాలి .మనసులో పద్యాన్ని నెమరు వేసుకుంటున్నాను. సారీ సార్, మీ మాట వినకుండా నేను వేరే సబ్జెక్టు చదువుతున్నాను మనసులో” అంది గిల్టీగా.

“పర్వాలేదు మానసా, సరే నువ్వు బుక్స్ పెట్టేసి రా. చెప్తాను” అన్నారు సుధాకర్ సార్. మానస స్టాఫ్ రూమ్ లో బుక్స్ పెట్టేసి బయటకు వచ్చింది.

“నువ్వు క్లాస్ రూమ్ కి వెళ్లి తెలుగు బుక్ పట్టుకొని రా” అన్నారు. అలాగే వెళ్లి తెలుగు బుక్ తీసుకొని బయటకు వెళ్ళింది. సార్ చెట్టు కింద కూర్చున్నారు. ఏ పద్యం చెప్పు అంటే చూపెట్టింది.

“నేను చెప్తాను నా వెనకాల నువ్వు కూడా చెప్పు అని అన్నారు సార్ . సర్ చెప్తుంటే ఆశ్చర్యపోతూ సార్ ను అనుసరించింది మానస.

“సార్, మీకు తెలుగు వచ్చా? అని అడిగింది నవ్వుతూ.

“ అదేం ప్రశ్న ,మన మాతృభాష మనకి బాగా వస్తుంది. మన మాతృభాష తెలుగే కదా. నేను తెలుగు బాగా నేర్చుకున్నాను. తెలుగులో నుండే కదా మన మిగతా సభ్యులు నేర్చుకునేది. మనకి హిందీ ఇంగ్లీష్ రాకపోతే కాస్త గాభరా పడాలి .దాని మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి కానీ తెలుగు రాకపోతే ఎందుకు బాధపడడం? తెలుగు తప్పకుండా వస్తుంది. ఫస్ట్ నువ్వు ఆ పద్యాలకి అర్థం, వివరణ తెలుసుకో “అంటూ చక్కగా అర్థం అయ్యేలా చెప్పారు సార్. నాకు ఇప్పుడు వచ్చినట్టు అనిపిస్తుంది ఒకసారి చెప్తాను చూడండి అంటూ అప్పజెప్పేసింది మానస.

సార్ చాలా మెచ్చుకున్నారు .”చూడమ్మా, మనము చదివే విషయం మీద శ్రద్ధ ఉండాలి. పట్టుదలగా చదివితే దేనినైనా సాధించగలం. నువ్వు మనసుపెట్టి చదువు” అన్నారు.

అప్పటినుంచి వేరే సబ్జెక్టులలో ఏ అనుమానం వచ్చినా తెలుగుతో పాటు సార్ దగ్గరికి వెళ్లి చెప్పించుకోవడం నేర్చుకోవడం చేసింది మానస.అలా సంవత్సరాలు దొర్లిపోయాయి. ఇప్పుడు మానస తెలుగు ప్రొఫెసర్ గా ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగం చేస్తుంది.

ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతున్న తెలుగు సెమినార్ లో మానస అనర్గళంగా ఉపన్యాసం ఇస్తుంది. శ్రోతలని ఆకర్షించుకుంటూ, తన వాగ్ధాటితో మంత్రముగ్ధుల్ని చేస్తూ,వాళ్లు తన ఉపన్యాసం ఇంకా కొనసాగాలని ఉత్సాహపడేలా ప్రసంగిస్తూ, తన ప్రసంగంలో తను ఈరోజు ఈ స్థితిలో ఉండటానికి తనకి స్ఫూర్తి ప్రదాత తన సామాన్య శాస్త్ర బోధకుడు సుధాకర్ సార్ అంటూ చాలా వినయంగా గౌరవపూర్వకంగా చెప్పి సార్ కి మనస్ఫూర్తిగా సాష్టాంగ పాదాభివందనం చేస్తున్నాను" అన్నది మానస.

తను ఆ మహనీయున్ని ఆదర్శంగా తీసుకొని అతని బాటలోనే పయనిస్తున్నానని చెప్తూ తన ఉపన్యాసాన్ని ముగించింది మానస.

ఆ సెమినార్ కి వచ్చిన సుధాకర్ సార్ సభా వేదిక పైకి రావడం చూసి ఆశ్చర్యపోయింది మానస. ఎదురుగా వెళ్లి సార్ కి పాదాభివందనం చేసింది. సార్ మైకు తీసుకొని "మానస నన్ను చాలా గొప్పవాడిగా ఆకాశానికి ఎత్తేసి మాట్లాడుతుంది కానీ నేనేమంత గొప్పవాణ్ణి కాదు. నేను కేవలం మార్గదర్శకం మాత్రమే చేశాను. తను ఈ స్థాయికి చేరుకోవడం వెనకాల తన పట్టుదల, కృషి ,నిరంతర సాధనమే కారణం.

నా శిష్యురాలు ఇంత ఉన్నత స్థాయికి ఎదగడం నాకు చాలా గర్వంగా ఉంది. నేను మానసని మనసారా అభినందిస్తున్నాను. తనని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా ఎదగాలని "తన ఉపన్యాసాన్ని ముగించారు.

ఆ సభాస్థలి అంతా చప్పట్లతో మారుమోగింది.






EDITORIAL BOARD

Editor-in-Chief:
Dr. (Mrs.) Radha Kusuma

Co-Editors
Dr. Mantri Pragada Markandeyulu, Litt.D.,
Dr. B. Rama Devi, MA, B Ed.,
Dr. Bhavani Krishnamurthy
Shri A Rammurthy Raju

Management
Dr. Tarapatla Satyaarayanna, Ph.D
Ms. Mamatha Ummadi Singh, MA (Hindi)
Dr Jeldhi Vidhyadhar IRS
Shri Badesab Pinjari
Shri K. Murali Mohan Raju

Legal Advisor
Shri Manuvada Bhanoji Rao High Court Advocate, Hyderabad & Amaravathi.



వాణిజ్య ప్రకటనలు తీసుకోబడును


# కుసుమ జయభేరి



తెలుగు సాహిత్య సేవా సాంస్కృతిక e-మాసపత్రిక

# KUSUMA JAYABHERI E-MAGAZINE

Monthly Telugu Language.


Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com
www.kusumajayabheri.org